# వేలెత్తి ప్రశ్నిస్తున్న జనం

ఉదయం ఆరుగంటలు కావస్తున్నది. నెల్లూరులో ఆత్మకూరు బస్టాండు దగ్గరగా రిక్షాఆగింది. లగేజీ ఎక్కువ లేదు. ఒక్క ప్లాస్టిక్ బ్యాగ్ తప్ప. రిక్షా దిగి బస్‌స్టాండు లోపలకు నడిచాను. అప్పుడప్పుడే తెరుచుకొంటున్న అంగళ్ళు. వచ్చే పొయ్యే బస్సులు. అక్కడక్కడా చెదురు మదురుగా జనం. ఇంకా బాగా ఎండరాని కారణాన వీచే చల్లని గాలి.

నా మొరాలకించినన్నట్టుగా వచ్చింది తిరుపతి విజయవాడ ఎక్స్‌ప్రెస్. ఆగిన కొద్దిసమయం లోనే ఎట్టాగో ఎక్కగలిగాను. అన్ని సీట్లూ నిండుగా వున్నాయి. ఇప్పుడు ఎక్కిన మగవాళ్ళు నిలబడ్డారుకూడా. ముందు సీట్లో భార్యాభర్తలేమో ఇద్దరే ఉన్నారు. ఒళ్ళో బిడ్డ నిండా రగ్గు కప్పి ఏడెనిమిదేళ్ళుండవచ్చు.

ఇంకొకరు కూర్చోవచ్చు. రాడ్ పట్టుకు కొంచెంసేపు నిలబడ్డాను. ఆయన సరే ఆవిడయినా జరిగి స్థలమివ్వడంలేదు. సర్ది కూర్చోబెట్టాల్సిన అవసరం కండక్టర్ కుండదు. నేనే అడిగాను. "కాస్త సర్దుకుంటారా ?" అని.

ఇద్దరూ ఇటు జరిగి కిటికీవైపు కాస్త అంటే ఏడేళ్ళ పిల్లవాడికి తప్ప నాలాంటి దానికి ఎటూ చాలనట్టుగా జరిగి స్థలమిచ్చారు. "ఇంకాస్త జరగండి" అని మరీ మరీ అడగాలంటే సభ్యత అడ్డు వచ్చింది. ఎక్స్‌ప్రెస్సేకదా స్కూలు టయిముకు అందుకోవచ్చని ధీమాగావుంది మనస్సులో

బెల్ మోగింది. ఒక్క కుదుపుతో కదిలింది బస్సు. చాలీచాలని స్థలంలో సర్దుకు కూర్చుందామన్నా వీలుకావడంలేదు. ముందుసీటు ఎమర్జెన్సీ తలుపు హేండిల్ డొక్కలో గుచ్చుకుంటున్నది.

ఆ సర్దుకోవడంలో ఒక్కసారి చెయ్యి తగిలిందేమో గయ్యిమన్నది. "ఏవమ్మా ! బిడ్డని అట్టా పొడుస్తావూ ? ఆ మాత్రం జ్ఞానంలేదా ?" అంటూ "నా తప్పేమిటమ్మా ?" అని ఎదురు మాట్లాడుదామన్నా చదువునేర్పిన సంస్కారం అడ్డొచ్చింది "సారీ !" అని డొక్క నొప్పెడుతున్నా, కిటికీ వైపే జరిగాను. కాళ్ళు చాచుకుందామన్నా ముందంతా లగేజీ, బుట్టలూ, తట్టలూనూ.

అప్పుడు తెలిసింది కిటికీలో నుంచి చల్లగావీచే

**లారీలు ఢీకొన్న అదురుకో, మరెందుకో క్రిందపడి ప్రాణాలు పోగొట్టుకున్నాయి కొన్ని బర్రెలు,దూడలూ ఒక ప్రక్క నిండు చూడిబర్రేమో ఆ యాక్సిడెంట్‌కి లేగదూడ క్రిందపడి చచ్చిపోయింది. రోడ్డంతా రక్తం!**

గాలిలోని హాయి. చెంపకు చెయి చేర్చి ప్రక్కకు చూశాను. వెనుకకు పరుగెత్తే చెట్లవంక

ఆడవాళ్ళూ, మగవాళ్లూ, పిల్లలూ, తట్టలూ, బుట్టలూ చేతబట్టి గుంపులు గుంపులుగా పరుగెత్తుతున్నారు. అలాగే గుంపులు గుంపులుగా నెత్తిన బరువుగా మోస్తూ తిరిగి వస్తున్నారు కొందరు. అవేమిటో దూరానికి అర్థంకాలేదు

ఒక ఫర్లాంగు వెళ్ళి వుంటుందేమో బస్సు. క్రమంగా స్లో అయి ఆగింది. ముందుగా ఇంకా ఆగివున్నాయి బస్సులూ. లారీలు. ఒకటే రణగొణ ధ్వని. పరికించిచూశాను. లారీ వెనుకవైపు కన్పిస్తున్నది ఒకప్రక్కగా. బిల బిల లాడుతూ బస్సులో జనం దిగుతున్నారు. ముందు బస్సు కదిలి వెళ్ళగానే మా బస్సును మరికాస్త దగ్గరగా తీసుకెళ్ళి ఆపాడు డ్రైవరు. అపుడు చూశానుసరిగా. కళ్ళు బైర్లు కమ్మినట్టయింది.

బహుశా ప్రమాదం జరిగి ఎక్కువసేపు అయి వుండదు. ఇంకా పోలీసులుగ్రటా రాలేదు. రెండు లారీలు ఎదురెదురుగా. ఒక లారీ నిండుగా కూల్ డ్రింక్సు బాటిల్సుతో నిండిన చెక్క కేసులు. ఒక్కొక్క కేసులో ఇరవై నాలుగు సీసాలుంటాయనుకుంటాను. ఎత్తుగా పేర్చినట్టున్నాయి. మరో లారీ నిండుగా ఢిల్లీ బర్రెలూ, దూడలూ. రెండు లారీలు ఢీకొన్నాయేమో తీవ్రంగా గాయపడ్డాయి.

బాటిల్సున్న లారీ ముందువైపు పూర్తిగా రెండో లారీలోకి చొచ్చుకుపోయింది. డ్రైవర్సు ఆనవాలులేకుండా నెత్తురుముద్దలై పడివున్నారు. ఎర్రని చిక్కని రక్తంలో అక్కడక్కడా చెల్లాచెదురుగా పగిలిన గాజుపెంకులపై, సూర్యరశ్మి పడి మెరిసి, ఆ మెరుపు కళ్ళల్లోకి దూసుకు కొస్తోంది.

లారీలు ఢీకొన్న అదురుకో, మరెందుకో క్రింద పడి ప్రాణాలు పోగొట్టుకున్నాయి కొన్ని బర్రెలు, దూడలూ. ఒక ప్రక్క నిండు చూడిబర్రేమో ఆ యాక్సిడెంట్‌కి లేగదూడ క్రిందపడిచచ్చిపోయింది. రోడ్డంతా రక్తం. ఆ దృశ్యం చూస్తుంటే కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి.

ఇద్దరు ముగ్గురు నీరకావిపంచెలూ. తలపాగాలూ వున్నవాళ్ళు నెత్తిపట్టుకొనిఒకప్రక్కగా కూర్చొని వున్నారు. బహుశా బర్రెలతో వస్తున్న

ఆసామీలేమో. ఈ డ్రైవర్లిద్దరి భార్యాబిడ్డలెక్కడున్నారో? కనీసం చూసుకోను శవాలైనా దొరకని దయనీయ పరిస్థితి. తప్పు ఏ డ్రైవర్దయినా కావచ్చు శిక్ష అనుభవించింది ఇద్దరూ పరోక్షంగా ఎందరో?!

"దించండి, దించండి, ఇటు, ఇటందించండయ్యా అరే! సీసాలెందుకు? కేసులందుకోవయ్యా" ఒకటే కలకలం. కళ్ళు తుడుచుకొని చూశాను పరుగులెత్తుతున్న జనాలతలలపై వున్న బరువులేమిటో అర్థమైంది. బుట్టలనిండుగా నింపుకున్న సీసాలు. పాటకజనం చేస్తున్నారు సరే! మరి ఈ బస్సులో బెల్ బాటం ప్యాంట్లు, సీకో వాచీలు చేస్తున్న పనేమిటి?

డ్రైవరూ, కండక్టరూ రెండు కేసులు తీసి ముందున్న బానెట్ పైన పెట్టుకున్నారు. అది జారకుండా ఒక ప్రయాణీకుడు పట్టుకుకూర్చున్నాడు. నా చెయ్యి తగిలినందుకే జ్ఞానం లేదా అన్న మనిషి వేస్ట్ పేపర్ బాస్కెట్ నిండుగా పది పన్నెండు సీసాలు తెచ్చిపెట్టుకున్నది. ఇప్పుడు ఆవిడ జ్ఞానం ఏమయిపోయిందో.

తలత్రిప్పితే ముందు డ్రైవరు సీటుక్రిందుగా ఇంకా బొట్టుబొట్టుగా రక్తం పడుతూనే వుంది. భయం గొలిపేలా వుంది ఆ ప్రదేశమంతా.

ఎవరో పిలిచినట్లయి ఇటు తిరిగాను ఎదురుగా ఒక యువకుడు. చేతిలో అప్పుడే విప్పిన బాటిల్ నురగలు దిగకారుతూ. "తీసుకోండి..." అంటున్నాడు. ఒక్క క్షణం బాటిల్ వంకా, ఆ యువకుడి వంకా చూశాను. డ్రైవరు సీటు క్రిందుగా కారే రక్తం బొట్టుబొట్టుగా నింపుకొచ్చినట్టనిపించింది. కళ్ళల్లో తిరగబోయిన నీటిని అదిమిపట్టుకొని తలతిప్పాను అడ్డంగా. ఆశ్చర్యపోయాడు. ఆ యువకుడి చేతిలోని సీసాను మరొకరు తన్నుకుపోయారు ఇంతలో.

"ధన్"మన్న శబ్దంతో సీసాలు బస్సు కిటికీల్లో నుండి క్రిందపడి పగిలి చెల్లాచెదురౌతున్నాయి. సీసాలు తాగిందిగాక పగలగొట్టడం కూడానా? నివ్వెరపోయి చూస్తున్నాను. అర్థరూపాయ క్రిక్ మీద రూపాయ పావలా వసూలు చేస్తున్నారు వీళ్ళకలాగే కావాల్సిందే" అంటున్నారెవరో.



కానీ ఈ జనం ఎందుకాలోచించరూ? ఏ తండ్రి తనకున్నది అమ్మి ఈ లారీ కేసులు కొన్నాడో? ఇది అమ్మి బిడ్డ పెళ్ళి చెయ్యాలేమో? ఈనాడిలా జరిగినందుకు ఆ పీటల మీద పెళ్ళి ఆగిపోతే ఆ బిడ్డ ఆత్మహత్య చేసుకుంటుందేమో? లేదా ఏ తండ్రీ తన కొడుకుపై చదువులు ఈ కేసులమ్మిన డబ్బుకు ముడిపడి వున్నాయో? అని ఎందుకాలోచించరీ జనం?

శ్మశానంలో గుంటలోంచి లాగిన పీనుగను తిన్న నక్కలా కదిలింది బస్సు. ప్రతి ఒక్కరి ముందున్న కేసుల్లోంచి సీసాలు చేసే నాదం, ఆఖరు నిముషంలో ఆ డ్రైవర్సు బ్రతెలూ, దూడలూ కలిసి చేసే ఆర్తనాదంలా. భయంకరంగా విన్పించాయి. ఈ బస్సు నుండి దూకి మరో బస్సు ఎక్కుదామన్నా, ఆ బస్సులోనూ ఈ సీసాలు లేవని గ్యారంటీ ఏమిటి? *